శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం

సృష్టిలో చరాచర వస్తువులన్నిటిలోనూ మానవాతీతమైన, అనిర్వచనీయమైన, అవ్యక్తమైన, చైతన్యవంతమైన, ఏదో తెలియని ఒక మహా అద్భుత శక్తి ఒకటి దాగి ఉంది. ఆ శక్తినే మహేశ్వరీ శక్తిగానూ, పరాశక్తిగానూ, జగన్మాత శక్తిగాను పలు రూపాల్లో పిలుస్తూ ఉపాసిస్తూ ఉంటారు. ఈ నవరాత్రుల పుణ్య దినాలలో ఏనోట విన్నా ఈ దుర్గా సప్తశతి శ్లోకం వింటూనే ఉంటాం. ఈ సందర్భంగా దేవీ శరన్నవరాత్రులకు సర్వం సిద్ధమైంది.



ఆకట్టుకునే రూపంలో దుర్గాదేవి విగ్రహం

- విద్యుత్తు దీపాలతో దేవీ ఆలయాల అలంకరణ
- సర్వం సిద్ధం చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు
- తెల్లవారు నుంచి ప్రత్యేక పూజలు
- ఉదయం 8 గంటలకు కలశ స్థాపన



విక్రయానికి సిద్ధమైన విగ్రహాలు

మాడుగుల: ఉమ్మడి విశాఖ జిల్లాలో దేవీ నవరాత్రులు వైభవోపేతంగా నిర్వహించడంలో మాడుగుల పేరుగాంచింది. మహరాజుల పాలన కాలం నాటి నుంచి ఇక్కడ ఏటా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా మెటారు యూనియన్ ఆధ్వర్యంలో అలనాటి సంప్రదాయాలను కొనసాగిస్తూ దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. భారీ స్థాయిలో చలువ పందిర్లు, పచ్చని తోరణాలు, అరటి చెట్లతో అలంకరణ వంటి ఏర్పాట్లు చేశారు. దేవీతల్లిని దర్శించుకోవడానికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రోజుకొక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడానికి స్టేజులు సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణం చుట్టూ భారీ విద్యుత్ లైటింగ్ అలంకరించారు.

నేటి నుంచి అప్పలరాజుపురంలో..

మాడుగుల రూరల్: చీడికాడ మండలం అప్పలరాజుపురం దేవి మెట్టపై వెలిసిన లలితాదేవి ఆలయంలో శరనవరాత్రులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి పూజను సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు దంపతులు చేస్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ నెల 23న అన్నసమారాధన, జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతోపాటు ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదా వరలక్ష్మి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ హాజరు కానున్నారు. ఉత్సవాలకు సంబంధించి గోడపత్రికలను సర్పంచ్, ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం విడుదల చేశారు.

చీడికాడలో..

చీడికాడలో చావిడి వద్ద శాస్త్రోక్తంగా విజయదశమి ఉత్సవాలు ఆదివారం ఉదయం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, కలశ స్థాపన కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుతోపాటు వివిధ పార్టీల నాయకులు హాజరవుతారని దుర్గాదేవి సేవా సంఘం, ఉత్సవ కమిటీ వారు శనివారం పేర్కొన్నారు. ఈ నెల 18న రాత్రికి నృత్య పోటీలు, 21న అన్న సమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున కనక దుర్గమ్మ ఆలయం ముస్తాబైంది. నాలుగేళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయాన్ని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో...

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయాభివృద్ధి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం తొమ్మిది కలశాలు ఏర్పాటు చేసి కుంకుమ పూజ ప్రారంభిస్తామన్నారు. ఈ పూజలు ఈ నెల 24వ తేదీ విజయదశమి వరకు కొనసాగుతాయన్నారు. తొమ్మిది రోజుల పాటు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు విరాళాలు నగదు, లేదా బియ్యం రూపంలో అందించాలని కోరారు.

ఎం. కోడూరులో..

ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవికి మహానివేదన నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకటరమణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కలశ స్థాపన చేస్తామని, ఈ నెల 23వ తేదీ వరకు నిత్య పూజ కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

దుర్గామల్లేశ్వర ఆలయంలో

మాకవరపాలెం: స్థానిక బీసీ కాలనీలోని దుర్గామల్లేశ్వర ఆలయంలో ఈ నెల 15 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకుడు మల్లికార్జునశర్మ తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

సీతయ్యపేటలో దుర్గామల్లేశ్వర్ల ఉత్సవాలకు ఏర్పాట్లు

బుచ్చెయ్యపేట: సీతయ్యపేటలో దుర్గామల్లేశ్వర్ల శరన్నవరాత్రుల మహోత్సవాలకు ఆలయ అభివృద్ధి కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఇప్పటికే ఆలయం, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి రంగులు వేసి భారీ విద్యుత్ లైటింగ్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. టన్ను బరువుతో ఏకశిల రూపంలో దర్శనమిచ్చే అమ్మవారిని కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు నమ్ముతారు. ఏటా అమ్మవారి దర్శనం కోసం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. వేలాది మంది భవానీభక్తులు ఇక్కడ దీక్షలు ముగిసే వరకు నిత్య పూజలు చేస్తుంటారు. 22న మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధనతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీశక్తి పంచాయతన అమ్మవారు

నాతవరం: భక్తులు ఆరాధ్య దైవంగా పూజించే దుర్గాదేవి ఆలయంలో శరవన్నరాత్రులకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాతవరం సమీపంలో తాండవ కాలువ ఒడ్డున శ్రీశక్తి పంచాయతన ఆలయ సముహం ఇటీవల సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఈ ప్రాంతీయులు ఏ పనీ తలపెట్టిన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రారంభిస్తే దిగ్విజయంగా పూర్తవుతుందని అపారమైన నమ్మకం. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ప్రధానంగా ఇక్కడ ఆలయం ఆనుకుని తాండవ కాలువ నీరు ప్రవహిస్తోంది. ఈ నీటిలో భవానీమాల ధారణ భక్తులు స్నానమాచరించి ఆలయంలో పూజలు చేస్తుంటారు.



నాతవరం: కాలువ గట్టుపై అమ్మవారు



మాడుగుల: అలంకరణలో దేవీ తల్లి



సీతయ్యపేటలో ఏకశిల రూపంలో దుర్గామల్లేశ్వర్ల అమ్మవారు



వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున కనక దుర్గమ్మ



మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం



నాతవరం: విద్యుత్తు దీపాలంకరణలో అమ్మవారు ఆలయం

ప్రత్యేక ఏర్పాట్లు చేశాం



ఆలయానికి వేలాది సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. రోజూ వేదపండితులతో ప్రత్యేక పూజలు చేయనున్నారు. అమ్మవారి దశావతార అలంకరణలకు కావలసినవి సమకూర్చాం.

శెట్టి సతీష్,
ఆలయ ధర్మకర్త నాతవరం

జోరుగా అమ్ముడుపోయిన దేవీ విగ్రహాలు

కె.కోటపాడు: దేవీ శరన్నవరాత్రులకు సర్వం సిద్ధమైంది. తొమ్మిది రోజుల పాటు పూజలందుకోనున్న దుర్గాదేవి విగ్రహాలను గ్రామగ్రామాన భవానీమాలధారణ భక్తులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే చౌడువాడలో ఆకర్షణీయమైన రూపాల్లో తయారైన 1,500 విగ్రహాలను కొనుగోలు చేశారు. ఇక్కడ 50 మంది యువకులు 2 నుంచి 8 అడుగుల ఎత్తు వరకు ప్రతిమలు తయారు చేశారు. 15 ఏళ్లుగా ఏటా వీరు తయారీ చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వచ్చి కొనుగోలు చేశారు.



విగ్రహాన్ని తరలిస్తున్న భవానీమాలధారణ భక్తులు

విగ్రహాల తయారీతో స్వయం ఉపాధి



ఏటా విజయదశమి పర్వదినం సమయానికి దేవీ విగ్రహాలను తయారీ చేసి ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ తయారీ చేసే అమ్మవారి విగ్రహాలు ఆకట్టుకునే రూపాలతో, రంగులతో ఉండడం వల్ల ఏటా డిమాండ్ ఉంటోంది.

ఎం.ఈశ్వరరావు,
విగ్రహాల తయారుదారుడు, చౌడువాడ

క్లుప్తంగా

యాదవ సంఘం మండలాధ్యక్షుడికి పరామర్శ



అప్పలరాజు ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: యాదవ సంఘం మండలాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ స్టీరింగ్ కమిటీ మండలాధ్యక్షుడు నమ్మి అప్పలరాజును ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం పరామర్శించారు. ఇటీవల అప్పలరాజు రోడ్డు ప్రమాదానికి గురై విశాఖలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అప్పలరాజును అతని భార్య ఆర్. శివరాంపురం సర్పంచ్ నమ్మి నీరజను విప్ ధర్మశ్రీ కలిశారు. అప్పలరాజు యోగ క్షేమాలు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



జాలంపల్లిలో ర్యాలీ చేస్తున్న ఆశ కార్యకర్తలు

మాడుగుల రూరల్: బాల్య వివాహాలు వద్దని, వీటి వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని శనివారం జాలంపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్(సీడ్) ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఈ ర్యాలీ చేపట్టారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అనేక అనారోగ్యపరమైన సమస్యలు వస్తాయని సర్పంచ్ గణతూరి దారమల్లేశ్వరి తెలిపారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గణతూరి చిన్ని పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు సిద్ధం



వంటపాత్రలు లెక్కిస్తున్న అకౌంటెంట్ శ్రీనివాసరావు

రోలుగుంట: జగనన్న గోరుముద్ద పథకం కింద మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలను పంపిణీ చేయనున్నట్టు ఎంఈవో-1 జానుప్రసాద్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో వాటిని అకౌంటెంట్ శ్రీనివాసరావుతో కలిసి లెక్కించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 జగ్గారావు వీటిని ఎ,బి,సి,డి,ఈ,ఎఫ్ ప్రాతిపదికన ఆయా పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

తారువలో వైఎస్సార్‌సీపీ సమావేశం నేడు

దేవరాపల్లి: మండలంలోని వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశాన్ని ఆదివారం తారువలోని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు, వలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ తక్షణ సాయం అందజేత



రాజేంద్రకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మాడుగుల రూరల్: జాలంపల్లిలో ఈ నెల 12న వెలుగుల చినబాబు మృతి చెందడంతో అతని కుమారుడు రాజేంద్రకు వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలు సర్పంచ్ గణతూరి దారమల్లేశ్వరి శనివారం అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాకు జమకానుందని సర్పంచ్ తెలిపారు. పార్టీ నాయకులు గణతూరి చిన్ని, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులు

డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గణేష్



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: స్థానిక మెయిన్‌రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శనివారం పరిశీలించారు. అబీద్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఎనిమిది వందల మీటర్ల పొడవున డ్రైనేజీ కాంక్రీట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా మారిన విద్యుత్ స్తంభాల తొలగింపు పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరితగతిన రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు ఏకశివ, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మార్మోగిన హరి నామస్మరణ

మాకవరపాలెం: శ్రీవారి నగర సంకీర్తన వైభవంగా సాగింది. తామరంలో వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వేంకటేశుని నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, అయ్యప్ప, దుర్గమ్మ మాల ధరించిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాకవరపాలెం ఆర్టీసీ బస్టాండు నుంచి తామరంలోని ఆలయం వరకు శ్రీవారి చిత్రపటాలతో ఈ నగర సంకీర్తన చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా హాజరైన భక్తులంతా వేంకటేశుని నామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రభాకరరాజు, రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్ప, భవానీ భక్తులు

జోరుగా విద్యుత్ మీటర్లకు ఆధార్ సీడింగు

రోలుగుంట: విద్యుత్ మీటర్ నంబర్లకు వినియోగదారుల ఆధార్ సీడింగు ప్రక్రియ ఆ శాఖ ఉద్యోగులు చేపట్టారు. ఈ మేరకు మండల విద్యుత్ శాఖ ఏఈ పద్మనాభం ఆదేశాల మేరకు గ్రామాల్లో వినియోగదారుల ఇళ్లకు వెళ్లి ముందుగా మీటరు నంబర్ యజమాని పేరు సరిపోల్చుకొని వారి ఆధార్ కార్డు నంబర్లను నమోదు చేసుకుంటున్నారు. దీనిలో భాగంగా రోలుగుంటలో 1,500 మీటర్లకు గాను 1,200 మీటర్లకు అసిస్టెంట్ లైన్‌మన్ శ్రీనివాసరావు, సహాయకుడు రాంబాబు శనివారం ఆధార్ సీడింగు చేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి మిగిలిన వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.



ఆధార్ సీడుంగు చేస్తున్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

దేవీ నవరాత్రుల గోడపత్రిక విడుదల



గోడపత్రికను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: పట్టణంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దేవీ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి గోడపత్రికను శనివారం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విడుదల చేశారు. ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా సదుపాయాలు ఏర్పాటు చేయాలని, ఎటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దేవరాపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి ఏఎన్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఆంధ్ర పద్యకవితా సదస్సు

అనకాపల్లిటౌన్: స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆంధ్రపద్యకవితా సదస్సు నిర్వహించనున్నట్టు సదస్సు జిల్లా అధ్యక్షుడు మెరుగుమిల్లి వెంకటేశ్వరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎంపీ కె.వి.సత్యవతి పాల్గొంటారన్నారు.

చమ్మచింతలో అమూల్ పాలకేంద్రం ప్రారంభం

నాతవరం: ప్రభుత్వం పాడి రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక చర్యలు చేపడుతుందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి తెలిపారు. జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా శనివారం చమ్మచింతలో ఏర్పాటు చేసిన అమూల్ పాల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడమే కాకుండా అదనంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రాజకీయాలతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా వీటిని అందించి వైఎస్సార్‌సీపీకి మరింత మద్దతు చేకూర్చారన్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో సైతం కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడంతోపాటు ఎమ్మెల్యే గణేష్‌ను మరలా గెలిపించాలన్నారు. అమూల్ పాల కేంద్రానికి పాలు సరఫరా చేసే రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని పాల ఉత్పత్తి పెంచాలన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పాలు పోసి అమూల్ పాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్ మైనం శ్రీనాగోపి

రైతు కుటుంబానికి సొసైటీ సాయం

రావికమతం: సభ్యరైతు కుటుంబానికి అండగా సొసైటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎంపీపీ పైల రాజు అన్నారు. ఆర్.కొత్తూరు గ్రామానికి చెందిన సొసైటీ సభ్యరైతు రాములపూడి పెద్ద దేముడు శనివారం మృతి చెందాడు. ఆయన దహన సంస్కారాల నిమిత్తం సొసైటీ నుంచి రూ.5 వేలు అతడి కుటుంబీకులకు అందించారు. ప్రతి రైతు సొసైటీలో సభ్యుడై ప్రభుత్వ సాయాన్ని పొందాలని తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ కొత్తకోట సొసైటీ చైర్మన్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, నాయకుడు బేతా పాండు, సీఈవో రఘు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న సత్యదేవ తదితరులు

నీలకంఠాపురంలో చేతిపంపు ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న రాంబాబు

బుచ్చెయ్యపేట: నీలకంఠాపురంలో పడాల కళ్లాల వద్ద ఏర్పాటు చేసిన చేతి పంపును జెడ్పీటీసీ దొండా రాంబాబు శనివారం ప్రారంభించారు. ఇటీవల కళ్లాల వద్ద బోరు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని గ్రామస్తులు కోరారు. ఆయన ఆదేశాలతో అధికారులు తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, సర్పంచ్‌లు పడాల నాగభూషణం, ఎల్లపు విజయ్‌కుమార్, సీతా బుజ్జి, మాజీ సర్పంచ్ దేగల అప్పారావు, నాయకులు రవి పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com